చర్యలు తీసుకోవాల్సి ఉంది



డాక్టర్లు భయంతో పనిచేసే పరిస్థితి ఉండకూడదు. వైద్యులు, సిబ్బందిపై దాడి చేయాలంటేనే భయం కలగాలి. కఠినమైన చట్టాలతోనే ఇది సాధ్యమవుతుంది. కోల్‌కతా తరహా ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. పటిష్ట చట్టాల అమలుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– నవీన్‌కుమార్‌రెడ్డి,
చిత్తలూరు పీహెచ్‌సీ వైద్యుడు

రక్షణ ప్రభుత్వ బాధ్యత



డాక్టర్లు, సిబ్బంది విధులు నిర్వర్తించే క్రమంలో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకున్నా వారిని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఆ విధంగా ఉన్నప్పుడే పూర్తిస్థాయిలో పనిచేసేందుకు వీలవుతుంది. ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఘటన బాధాకరం. కిరాతకంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలి.

– శేషారత్నం,
ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆత్మకూరు

దాడులు చేయడం బాధాకరం



వైద్యులు ఎంతో కష్టపడి పనిచేస్తారు. రోగులను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయాలని కృషి చేస్తుంటారు. అలాంటి వారి సేవలను గుర్తించకుండానే పలువురు దాడులు చేయడం బాధాకరం. ఇటీవల జరిగిన ఘటనలతో విధులు నిర్వర్తించాలంటేనే డాక్టర్లు భయపడుతున్నారు. ముఖ్యంగా మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి.

– డాక్టర్ శ్రావణ్‌కుమార్,
ఆత్మకూరు



క్లుప్తంగా

కృష్ణ మందిరంలో విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో గల కృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు.. రుక్మిణీ, సత్యభామ సమేత కృష్ణుడి కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పంచామృతాభిషేకాలను ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో మంగళవారం జరిపారు. ఉభయకర్తలుగా విజయరామరాజు, గిరిజ, రాఘవేంద్ర, శైలజ, కృష్ణాంజనేయ, రాధ, బిజ్జం విజయకుమార్‌రెడ్డి, వాణిమల్లీశ్వరి, జయప్రకాష్, హేమమాలిని దంపతులు వ్యవహరించారు. అన్నమాచార్య సంకీర్తనలను టీటీడీ సౌజన్యంతో హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగామ్ అసిస్టెంట్ నాయక్ ఆధ్వర్యంలో ఆలపించారు. మందిర ధర్మకర్త వెంకటేశ్వర్లు, మందిర కమిటీ ఉపాధ్యక్షుడు వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా వేణుగోపాలస్వామి కల్యాణం



నెల్లూరు(బృందావనం): క్రాంతినగర్‌లోని శివకేశవులు దేవస్థానంలో రుక్మిణీ, జాంబవతి సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా మంగళవారం నిర్వహించారు. అనంతరం నగరోత్సవాన్ని వేడుకగా జరిపారు. కోలాట ప్రదర్శనను శ్రీనివాస వైష్ణవి కోలాట మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా బట్టిపాటి హరిప్రసాద్‌రెడ్డి, రాజేశ్వరి, రమణయ్యనాయుడు, రమాదేవి దంపతులు, మనోహర్‌బాబు, సుజాత, కొమ్మిశెట్టి మునిరాజా, మునిలక్ష్మి తదితరులు వ్యవహరించారు. దేవస్థాన ట్రస్ట్ చైర్మన్ దర్శిగుంట పెంచలయ్య, అనుపల్లి మస్తాన్‌రెడ్డి, గంగపట్నం రవీంద్రరెడ్డి, రామిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వడ్డే శ్రీనివాసులు, యనమల గోవింద్, లోకనాథం మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



నెల్లూరు(బృందావనం): టౌన్‌హాల్లో నిర్వహిస్తున్న కళోత్సవ వేడుకల్లో భాగంగా కూచిపూడి కళాకారుడు డేగల సాంబశివరావును కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బలరామయ్యనాయుడు, రమణయ్య, గోవర్దన్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంఖ్య పెరగడం శుభపరిణామం

నెల్లూరు(అర్బన్): ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ – 5 సర్వే మేరకు జిల్లాలో బాలికల సంఖ్య పెరగడం శుభపరిణామమని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. పీసీ, పీఎన్‌డీటీ చట్టం అమలు తీరుపై నగరంలోని వైద్యశాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం వెయ్యి మంది బాలురకు 1011 మంది బాలికలున్నారని తెలిపారు. ఈ నిష్పత్తి తగ్గకుండా ఉండేందుకు స్కానింగ్ సెంటర్లపై తనిఖీలను తరచూ చేపట్టేలా ప్రణాళికలను రూపొందించామని వివరించారు. అనంతరం సరోగసీ ద్వారా సంతానం పొందాలనుకునే వారి దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. డివిజనల్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ దయాకర్, డీఐఓ ఉమామహేశ్వరి, గైనకాలజిస్ట్ ఇందిర, పిల్లల డాక్టర్ సర్దార్ సుల్తానా, డాక్టర్ కిరణ్, కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌లో ఉన్న ఎస్సైలకు పోస్టింగ్

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో వీఆర్‌లో ఉన్న ముగ్గురు ఎస్సైలకు పోస్టింగ్‌లు కల్పిస్తూ ఎస్పీ కృష్ణకాంత్ ఉత్తర్వులను మంగళవారం జారీ చేశారు. అబ్దుల్ రజాక్‌ను చిన్నబజార్‌కు, రఘునాథ్‌ను నెల్లూరు సీసీఎస్‌కు, తిరుపతయ్యను ఇందుకూరుపేట ఎస్సైలుగా నియమించారు. కాగా నెల్లూరు నార్త్ ట్రాఫిక్ ఎస్సై శివశంకర్‌ను దక్కిలి ఎస్సైగా నియమిస్తూ తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

• కమిషనర్ సూర్యతేజ



పరిశీలిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): రోడ్లను ఆక్రమిస్తే జరిమానాలతో పాటు కఠిన చర్యలు చేపట్టాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నగరంలో పారిశుధ్య పనుల పర్యవేక్షణ నిమిత్తం పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. వివిధ కూడళ్లలోని ఐల్యాండ్లు, డివైడర్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. ఫుట్‌పాత్‌లపై ఎలాంటి వాణిజ్య, వ్యాపార బోర్డులను పెట్టొద్దని దుకాణదారులకు సూచించి, వాటిని తొలగించారు. నగరంలోని ఫుట్‌పాత్‌లను పరిశీలించి ఆక్రమణలపై జరిమానాలు విధించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని రోడ్లపై ఉన్న భవన నిర్మాణ సామగ్రి, ఆక్రమణలను తొలగించేలా నోటీసులను జారీ చేయాలని చెప్పారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం నుంచి పారిశుధ్య పనుల మానిటరింగ్ వ్యవస్థ పరిశీలించారు. సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సిబ్బంది హాజరును తనిఖీ చేసి, వారికి కేటాయించిన ప్రాంతం తదితరాలను ఆరాతీశారు. ఎంహెచ్‌ఓ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులు వేగవంతం

ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులు, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని కమిషనర్ సూర్యతేజ నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అన్ని గృహాల్లోని కాలువలను భూగర్భం ద్వారా అనుసంధానించి మురుగు శుద్ధి కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య, ఎల్ అండ్ టీ కంపెనీ డీజీఎం దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ



రవిరాజ్ చిత్రపటానికి నివాళులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పల్నాడు జిల్లా వినుకొండలో ఇటీవల నిర్వహించిన సీనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో నెల్లూరు జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో జట్టు క్రీడాకారులను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి అభినందించారు. అనంతరం అసోసియేషన్ పూర్వ కార్యదర్శి రవిరాజ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అసోసియేషన్ కార్యదర్శి కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘనపై జరిమానా

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ నిర్దేశించిన ప్రమాణాలను పాటించని ఏసీ సెంటర్‌లోని పినాకినీ బార్ అండ్ రెస్టారెంట్‌కు రూ.ఐదు వేల జరిమానాను శానిటేషన్ అధికారులు మంగళవారం విధించారు. బార్‌కు ఎదురుగా ఉన్న డివైడర్లలో తాగి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ బాటిళ్లను సిబ్బంది ఆధ్వర్యంలో తొలగించారు. మరోసారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కోలాహలంగా ఉట్టి మహోత్సవం

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ మెయిన్ రోడ్డులో ఉట్టి మహోత్సవాన్ని బాలాజీనగర్ యూత్ కన్వీనర్ కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. నుడా మాజీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రంజీ మాజీ క్రీడాకారుడు మలిరెడ్డి కోటారెడ్డి, ముంగమూరు చైతన్యరెడ్డి, హనుమంతరావు, అశోక్, రమేష్, దుర్గ, చక్రి, శేఖర్, చరణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రంగడి సన్నిధిలో కృష్ణ జయంతి



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో కృష్ణ జయంతిని వేడుకగా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్పగిరి రంగనాథస్వామి, కృష్ణుడికి తిరుమంజనం, తదుపరి కృష్ణావతార ఘట్ట పురాణ పఠనాన్ని జరిపారు. గోపురోత్సవం, ఊంజల్‌సేవను రాత్రి నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



ప్రిన్సిపల్ శ్వేతసంధ్య, వైస్ ప్రిన్సిపల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న రైజ్ మనహా.. జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో స్వర్ణ, రజత పతకాలను సాధించిన గోస్మితారెడ్డి, అభిశ్రీవర్ధన్‌ను నగరంలోని అవెన్యూస్ స్కూల్లో మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా వీరికి బహుమతులను వ్యవస్థాపకుడు పొన్నపోలు దీపక్‌రెడ్డి అందజేశారు. చైర్మన్ బాబునాయుడు, కరస్పాండెంట్ కృష్ణచైతన్య,

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్, ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నేర నియంత్రణకు పక్కా ప్రణాళిక

• ఎస్పీ కృష్ణకాంత్



ఇన్‌స్పెక్టర్ సుబ్బారావుకు ప్రశంసపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల కట్టడి సాధ్యమని, ప్రతి స్టేషన్ పరిధిలో పల్లె సందర్శన కార్యక్రమం ద్వారా వారికి మరింత చేరువవుదామని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. నేర నియంత్రణకు చేపడుతున్న చర్యలను నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం ఆయన తెలియజేశారు. నేరాలను కట్టడి చేసి ప్రజలకు మరింత మెరుగైన శాంతిభద్రతలను అందించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తామని వెల్లడించారు. ఇందులో భాగంగా డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు తమ పరిధిలోని గ్రామాలను విధిగా సందర్శించి, అక్కడి ప్రజలతో మమేకమై నేర నియంత్రణ చర్యలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. మహిళలు, యువతులు, చిన్నారుల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని వివరించారు. ఈవ్‌టీజింగ్, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేస్తామని ప్రకటించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100, 112 సేవలను వినియోగించుకోవాలని మహిళలకు సూచించారు. మహిళా హెల్ప్ డెస్క్‌లను బలోపేతం చేస్తామని వెల్లడించారు.

మత్తు, మాదకద్రవ్యాల కట్టడికి చర్యలు

మత్తు, మాదకద్రవ్యాల కట్టడికి పటిష్ట చర్యలు చేపడుతున్నామని, హాట్‌స్పాట్ల గుర్తింపు ప్రక్రియ జరుగుతోందని చెప్పారు. యాంటీ డ్రగ్‌స్క్వాడ్లను ఏర్పాటు చేసి నిరంతర దాడులు చేస్తామన్నారు. జిల్లాలో దొంగతనాల కట్టడే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు, శివారు ప్రాంతాల్లో లైటింగ్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేటర్లకు ప్రత్యేక శిక్షణను ఇస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని వెల్లడించారు. రోడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సురక్షిత డ్రైవింగ్ ప్రచారాన్ని సబ్ డివిజన్లలో ప్రారంభించి రోడ్డు ప్రమాదాలను నియంత్రిస్తామని వెల్లడించారు.

కఠినంగా వ్యవహరిస్తాం

శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని, కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. కమ్యూనిటీ పోలీసింగ్ అమలయ్యేలా చూస్తామని వెల్లడించారు. ఏఎస్పీ సౌజన్య, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూరల్ డీఎస్పీకి పరామర్శ

గంజాయి స్మగ్లర్లు వాహనంతో ఢీకొనడంతో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావును ఎస్పీ పరామర్శించారు. కేసులో డీఎస్పీ తెగువను మెచ్చుకొని ప్రశంసపత్రాన్ని అందజేశారు. జిల్లా పోలీస్ యంత్రాంగం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అభినందన

గంజాయి అక్రమ రవాణా కేసులో ప్రతిభ కనబర్చి నిందితుడ్ని చాకచక్యంగా అరెస్ట్ చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ కృష్ణకాంత్ అభినందించారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, వెంకటాచలం, బుచ్చిరెడ్డిపాళెం ఇన్‌స్పెక్టర్లు సుబ్బారావు, శ్రీనివాసులురెడ్డి, పొదలకూరు, కోవూరు, ఆత్మకూరు సీఐలు సుబ్బారావు, రాంబాబు, సుధాకర్‌రెడ్డి, గంగాధర్, ఎస్సైలు విశ్వనాథ్‌రెడ్డి, అజయ్ తదితరులకు ప్రశంసపత్రాలను అందజేశారు. ఏఎస్పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలి

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. నగరంలోని సంతపేట పోలీస్‌స్టేషన్, కోవూరు సర్కిల్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్పీ డీఎస్పీ శ్రీనివాసరావు, సంతపేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబునగర్‌లో కార్డన్ సెర్చ్

• సరైన పత్రాల్లేని 18 వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీస్ అధికారులు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని చంద్రబాబునగర్‌లో కార్డన్ సెర్చ్‌ను నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో వేదాయపాళెం, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్లు కిశోర్‌కుమార్, రోశయ్య తమ సిబ్బందితో కలిసి మంగళవారం నిర్వహించారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే పోలీస్ అధికారులు తమ సిబ్బందితో కలిసి చంద్రబాబునగర్‌లోని ప్రతి ఇంటినీ జల్లెడపట్టారు. ఇంట్లో ఎవరెవరు ఎంతకాలంగా ఉంటున్నారు.. ఏమి చేస్తున్నారు.. గతంలో ఎక్కడ ఉండేవారు.. ఇలా ప్రతి విషయాన్ని అక్కడున్న వారిని అడిగి తెలుసుకున్నారు. వీరి ఆధార్‌కార్డులను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారం, పాతనేరస్తుల కదలికలను అడిగి తెలుసుకున్నారు. అదే కాలనీలో నివాసం ఉంటున్న ఏడుగురు రౌడీషీటర్ల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలను సేకరించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, లేని పక్షంలో పీడీ యాక్ట్‌లను నమోదు చేయడంతో పాటు నగర బహిష్కరణ తప్పదని హెచ్చరించారు. రికార్డులు సక్రమంగా లేని 17 బైక్‌లు, ఆటోను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కరాటే పోటీల్లో స్వర్ణ పతకాలు



నెల్లూరు (టౌన్): విజయవాడలో ఈ నెల 22 నుంచి 24 వరకు నిర్వహించిన ఆసియా ఛాంపియన్‌షిప్ కరాటే పోటీల్లో రత్నం విద్యార్థులు పూర్వితేజ్, నేత్ర స్వర్ణ పతకాలను సాధించారు. నగరంలోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో గల పాఠశాలలో వీరిని స్కూల్ మేనేజర్ రాజేష్‌బాబు మంగళవారం అభినందించారు. ప్రిన్సిపల్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

• కృష్ణాష్టమి సందర్భంగా ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో రత్నం విద్యార్థులు ప్రతిభ చూపారని విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు తెలిపారు. సరస్వతీనగర్‌లోని పాఠశాలలో విద్యార్థులను అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. పాటల పోటీల్లో పూర్ణప్రశస్తి ప్రథమ, చిత్రలేఖనంలో లక్ష్మీసాయి జైత్రి తృతీయ బహుమతిని సాధించారని చెప్పారు. జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపల్ మణిమాల తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు



బహుమతుల ప్రదానం

నెల్లూరు (టౌన్): దర్గామిట్టలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన, డిబేట్ పోటీలను వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఇక్కడ గెలుపొందిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి బహుమతులను అందజేశారు. సమగ్రశిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు, ఎంఈఓ మురళీధర్, హెచ్‌ఎం కృష్ణారెడ్డి, రత్నశేఖర్, హరికిషన్, పరమేశ్వరరావు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సహకరించాలి



సమావేశాన్ని నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణకు తాము చేపడుతున్న చర్యలకు సహకరించాలని సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు కోరారు. స్టేషన్ పరిధిలోని కపాడిపాళెం, పెద్దబావి సెంటర్, తమిళవీధి, అరవవీధి ప్రాంతాలను మంగళవారం సందర్శించిన ఆయన స్థానికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మత్తు, మాదకద్రవ్యాల వినియోగంతో సంభవించే దుష్పరిణామాలను వివరించి వాటికి దూరంగా ఉండాలని యువతను కోరారు. అసాంఘిక కార్యకలాపాలు, సింగల్ నంబర్లాట, పేకాట, అనధికార మద్యం విక్రయాలు తదితరాలపై సమాచారం అందిస్తే చర్యలు చేపడతామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారమివ్వాలని సూచించారు.

ఆవాజ్ నేతల నిరసన



నెల్లూరు(దర్గామిట్ట): దేశంలో వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరించేందుకు చేస్తున్న ప్రతిపాదనలను వెంటనే విరమించుకోవాలని ఆవాజ్ నేతలు కోరారు. ఈ మేరకు నగరంలోని కలెక్టరేట్ ఎదుట నిరసనను ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర సభ్యుడు యస్దానీ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు వక్ఫ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని వెంటనే గుర్తించి పరిరక్షించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో వ్యాసపూజ

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇస్కాన్ మందిరంలో శ్రీల ప్రభుపాదులకు వ్యాసపూజను భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. తొలుత వైష్ణవ భజనలను నిర్వహించి కీర్తనలను ఆలపించారు. అనంతరం జగన్నాథ, బలరామ, సుభద్ర చెంత ఉంచిన శ్రీలప్రభుపాదమూర్తికి అభిషేకాలు చేశారు. మధ్యాహ్న హారతితో 56 వంటకాలతో నివేదన, కేక్‌ను కట్ చేశారు. సుమారు రెండు వేల మందికిపైగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. లాయర్ వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి, భారతిరెడ్డి దంపతులు, మందిరాధ్యక్షుడు డాక్టర్ శుకదేవస్వామి తదితరులు పాల్గొన్నారు.



తగినంత ఇసుకను అందుబాటులో ఉంచాలి



కార్పొరేషన్ కార్యాలయ ఎదుట నిరసన

నెల్లూరు(బారకాసు): ఇసుకను తగినంత మేర అందుబాటులోకి తీసుకొచ్చి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘ నెల్లూరు రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు ఖలీల్, కొండా ప్రసాద్, సీఐటీయూ రూరల్ కార్యదర్శి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయ ఎదుట మంగళవారం చేపట్టిన ధర్నాలో వారు మాట్లాడారు. నిర్మాణ రంగాన్ని నమ్ముకొని జిల్లాలో దాదాపు మూడు లక్షల మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్ ఇసుక రూ.ఐదు వేల్లోపు, టిప్పర్ ఇసుక రూ.20 వేల్లోపు ఉండేదని, దీంతో నిర్మాణ రంగం సాగేదని చెప్పారు. కార్మికుల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇసుకను తక్కువ రేటుకు ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని, అయితే రాష్ట్రంలో ఎక్కడా అమలు కావడంలేదని ఆరోపించారు. జిల్లాలోని డంపింగ్ యార్డుల్లో ఇసుక పూర్తిగా అయిపోయిందని, మర్రిపాడు వద్ద కొంత మేర ఉన్నా, దాన్ని నెల్లూరు తీసుకు రావాలంటే ఎంతో ఖర్చవుతుందని చెప్పారు. నిర్మాణ రంగాన్ని నమ్ముకొని జీవిస్తున్న లక్షలాది కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. తొలుత బారాషహీద్ దర్గా నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. భవన నిర్మాణ కార్మికులు సుధాకర్, సంపత్‌కుమార్, మాలకొండయ్య, సుధాకర్, రాజయ్య, రత్నం, ఖాజావలీ, కృష్ణయ్య, సురేష్‌కుమార్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రూరల్ తహసీల్దార్ కార్యాలయ సమీపంలో..

నెల్లూరు సిటీ: ఇసుక కొరత సమస్యను పరిష్కరించాలంటూ రూరల్ తహసీల్దార్ కార్యాలయ ఎదుట ధర్నాను భవన నిర్మాణ కార్మిక సంఘ, నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ, నెల్లూరు నగర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనుల్లేక భవన నిర్మాణ కార్మికులు నిరీక్షించాల్సి వస్తోందని చెప్పారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న 40 రకాల పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘ నగరాధ్యక్ష కార్యదర్శులు ఆవుల పెంచలయ్య, శ్రీనివాసులు, నేతలు సూర్యనారాయణ, చిరంజీవి, వెంకట్రావు, శేషం వెంకయ్య, మల్లికార్జున, శ్రీనివాసులు, కన్నయ్య సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.